సాక్షి నిర్మల్

బుధవారం । 13 । డిసెంబర్ । 2023



నిర్మల్ బస్టాండ్‌లో షాపులు దగ్ధం

జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. సమీప షాపుల్లోకి మంటలు ఎగిసిపడ్డాయి. వెంటనే అగ్నిమాపక యంత్రం వచ్చి మంటలు ఆర్పింది. 8లో▸

కేసీఆర్‌కు ఐకేరెడ్డి పరామర్శ



నిర్మల్‌టౌన్: హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను మంగళవారం మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి దంపతులు పరామర్శించారు. కేసీఆర్ త్వరగా కోలుకుని ప్రజల మధ్యకు రావాలని ఆకాంక్షించారు.

గరిష్టం/కనిష్టం
28.0/17.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లగాలులు వీస్తాయి. చలి తీవ్రత పెరుగుతుంది. రాత్రివేళ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఉపాధ్యాయుడి ఒక్కరోజు వేతనం నిలిపివేత

సాక్షి ఎఫెక్ట్..

నర్సాపూర్ (జి): మండలంలోని సాయినగర్ తండా ఏకోపాధ్యాయ మండల పరిషత్ పాఠశాల ఉపాధ్యాయుడు సెలవు పెట్టగా సోమవారం పాఠశాల మూసి ఉంది. మంగళవారం 'సాక్షి'లో 'తెరుచుకోని పాఠశాల'.. శీర్షికన వార్త ప్రచురించగా స్పందన వచ్చింది. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈవో రవీందర్‌రెడ్డి పాఠశాల ఉపాధ్యాయుడి ఒక్కరోజు వేతనం నిలిపివేయాలని ఎంఈవో, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడిని ఆదేశించారు.

హుండీ లెక్కింపు



ఒడిబియ్యం లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

భైంసా: బాసర శ్రీజ్ఞాన సరస్వతీ ఆలయంలో మంగళవారం ఒడిబియ్యం, హుండీలను లెక్కించారు. 52.30 క్వింటాళ్ల ఒడిబియ్యం, 218 కిలోల ఎండు కొబ్బరి, 20.5కిలోల బరడి పోకలు, 64 కిలోల పసుపు కొమ్ములు, 15కిలోల బాదం, 41 కిలోల ఖర్జూర పండ్లను భక్తులు కానుకల రూపంలో సమర్పించారు. ఆలయానికి రూ.70,878 విలువైన కానుకలు, ఒడి బియ్యం హుండీ ద్వారా సమకూరినట్లు ఈవో విజయరామారావు తెలిపారు.

తపాలా ఉద్యోగుల సమ్మె



సమ్మెలో తపాలా ఉద్యోగులు

భైంసా: భైంసా డివిజన్ వ్యాప్తంగా తపాలా ఉద్యోగులు మంగళవారం నిరవధిక సమ్మెకు దిగారు. డిమాండ్లు నెరవేర్చాలని భైంసా సబ్ డివిజన్‌తోపాటు ముధోల్, బాసర ట్రిపుల్ ఐటీ, బాసర, కుంటాల, నర్సాపూర్ ఎస్వోల ఎదుట గ్రామీణ పోస్టల్ ఉద్యోగులు నిరసన తెలిపారు. నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ బ్యాంక్ సేవక్స్, ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులంతా పాల్గొన్నారు. ఎనిమిది గంటల పని, పింఛన్‌తోసహా అన్ని ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేర్చేదాకా సమ్మె కొనసాగిస్తామన్నారు. కాగా, వీరి సమ్మె కారణంగా మంగళవారం నుంచి భైంసా డివిజన్ వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో పోస్టల్ సేవలు పూర్తిస్థాయిలో నిలిచిపోయాయి.

ఏరియాస్పత్రిని సందర్శించిన ఎన్‌క్వాస్ బృందం



వైద్యులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌ప్రసాద్

భైంసాటౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఏరియాస్పత్రిని ఎన్‌క్వాస్ (నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్) బృందం మంగళవారం పరిశీలించింది. రాష్ట్ర అధికారి డాక్టర్ శ్రీనివాస్‌ప్రసాద్ ఆస్పత్రి సూపరింటెండెంట్ కాశీనాథ్ ద్వారా వివరాలు తెలుసుకున్నారు. బృందసభ్యులతో కలిసి ఆయా విభాగాల్లో వసతులు, ఆధునిక వైద్య పరికరాలు, ల్యాబ్‌లను పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవల గురించి వైద్యులు, సిబ్బందితోపాటు రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి ప్రతీరోజు వచ్చే రోగులు, ఇతర ఆస్పత్రులకు రిఫర్, తదితర వివరాలపై ఆరా తీశారు. ఆస్పత్రిలో సమస్యలు, అసౌకర్యాల వివరాలు నమోదు చేసుకున్నారు. నివేదిక ఉన్నతాధికారులకు అందజేస్తానని చెప్పారు.

ఇథనాల్ పరిశ్రమ వద్దు

దిలావర్‌పూర్: మండల కేంద్రం సమీపంలో చేపట్టిన ఇథనాల్ కర్మాగార నిర్మాణం నిలిపివేయించాలని దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల జేఏసీ నాయకులు సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. మంగళవారం దిలావర్‌పూర్ జేఏసీ సభ్యులు గ్రామపంచాయతీపై ఒత్తిడి తేగా కర్మాగారానికి వ్యతిరేకంగా గ్రామసభలో తీర్మానం చేశారు. సర్పంచ్ వీరేశ్‌కుమార్, నాయకులు, యువకులున్నారు.



దస్తురాబాద్: రాస్తారోకో చేస్తున్న ఆటో డ్రైవర్లు

ఆటోవాలా.. 'మహా'గోల



'సార్.. మేము ఎవరికీ పోటీ కాకుండా రోజంతా కష్టపడుతూ మాకు మేము ఉపాధి పొందుతున్నాం. వచ్చినదాంట్లో కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. మా పిల్లలను చదివించుకుంటున్నాం. ఇప్పుడు ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం పెట్టడంతో మాకు ఉపాధి తగ్గుతోంది. రోజుకు డీజిల్, ఆటో ఫైనాన్స్ పైసలు కూడా రావడంలేదు. ఇక ఇంటికి ఏం తీసుకుపోతాం.. కుటుంబాన్ని ఎట్లా పోషించుకుంటాం. ఇలాగే కొనసాగితే ఆటోడ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వస్తుందన్న భయం ఉంది. దయచేసి, ఇలాంటి ఉచిత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, మా కడుపులు కొట్టవద్దని ప్రభుత్వాన్ని కోరుతున్నాం..' అని నిర్మల్ నుంచి గ్రామాలకు ప్యాసింజర్ ఆటోను నడిపే గంగాధర్ వాపోతున్నాడు.

- మహిళలంతా ఆర్టీసీ బస్సుల్లోనే..
- గిరాకీ లేక ఆటోలన్నీ వెలవెల
- పలుచోట్ల డ్రైవర్ల ఆందోళనలు
- ప్రత్యామ్నాయం కోసం డిమాండ్



గిరాకీ లేక ఖాళీగా ఆటోడ్రైవర్లు

నిర్మల్: ఇలా గంగాధర్ ఒక్కరే కాదు. జిల్లావ్యాప్తంగా గ్రామాలకు ఆటోలు నడిపే డ్రైవర్లంతా ఆవేదన చెందుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ నిర్ణయంతో తమకు కనీసం రోజుకు రూ.200కూడా రావడం లేదని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కడెం, దస్తురాబాద్ మండలాల్లో మంగళవారం ఆందోళనలు, నిరసనలు తెలిపారు. జిల్లాకేంద్రంలోనూ వివిధ రూట్లలో నడిపే ఆటోడ్రైవర్లంతా దీనిపై ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం ఈ నిర్ణయం వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలూ చేపడతామని హెచ్చరిస్తున్నారు.

దస్తురాబాద్, కడెంలో రాస్తారోకోలు

దస్తురాబాద్/కడెం: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం కారణంగా తాము రోడ్డున పడ్డామని ఆటో డ్రైవర్లు మండల కేంద్రంలోని పాండ్వాపూర్–కలమడుగు రహదారిపై మంగళవారం రాస్తారోకో చేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతూ తహసీల్దార్ జకీర్‌కు వినతిపత్రం అందించారు. ఆటో డ్రైవర్లు శరత్, శ్రీనివాస్, మోయిన్, శేఖర్, నాగరాజు, గంగాధర్, భూమన్న, తిరుపతి తదితరులు పాల్గొన్నారు. అలాగే మహాలక్ష్మి పథకాన్ని రద్దు చేయాలని ఆటో, టాటా ఏస్ డ్రైవర్లు కడెం మండల కేంద్రంలో రాస్తారోకో చేశారు. కొన్నేళ్లుగా ఆటో నడుపుతూ వచ్చిన డబ్బులతో కుటుంబాలను పోషించుకుంటున్నామని వాపోయారు.



జిల్లాకేంద్రంలోని రూరల్ ప్యాసింజర్ ఆటోలు

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకంతో రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళంతా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తుండడంతో తమకు ఒక్క ట్రిప్పు కూడా రావడం లేదని, వెంటనే పథకాన్ని రద్దు చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈమేరకు కడెంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, తహసీల్దార్ రాజేశ్వరికి వినతిపత్రం అందజేశారు.

ఉపాధికి 'ఉచితం' దెబ్బ

జిల్లాలోని చాలా గ్రామాలకు ఇప్పటికీ బస్సు సౌకర్యం లేదు. ఇలాంటి అన్ని గ్రామాలకు ప్యాసింజర్ ఆటోలు నడుస్తున్నాయి. ఒక్కో గ్రామం నుంచి దాదాపు పది ఆటోలు నడిపిస్తున్నారు. ఉద్యోగం, ఉపాధి పనులు లేక చాలామంది ఫైనాన్స్ కంపెనీల ద్వారా లోన్లు తీసుకుని ఆటోలు కొనుక్కున్నారు. రోజంతా వాటిని నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఇలాంటి ఆటోవాలాలపై కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ నిర్ణయం పెద్దదెబ్బ కొట్టింది.

మహిళలే ఎక్కువ..

కిరాణా సామగ్రి, ఆస్పత్రులు, దుస్తులు, ఇతర షాపింగ్‌ల కోసమంటూ ఊర్ల నుంచి పట్టణాలు, మండలకేంద్రాలకు మహిళలే ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారు. ఆటోలకు వారి గిరాకీయే ఎక్కువగా ఉంటుంది. తాజాగా ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తుండటంతో చాలా రూట్లలో మహిళలు ఆటోలు ఎక్కడం లేదు. కాస్త ఆలస్యమైనా సరే.. ఆర్టీసీ బస్సులోనే వెళ్తున్నారు. ప్రయాణం ఉచితం కావడంతో బస్సువేళలు తెలుసుకుని మరీ.. వాటిలోనే ప్రయాణిస్తున్నారు. దీంతో ఆయా రూట్లలో నడిచే ప్యాసింజర్ ఆటోలకు గిరాకీ పడిపోయింది. రోజుకు రూ.800–రూ.1,000 వరకు ఉండే గిరాకీ ఇప్పుడు రూ.200కూడా రావడం లేదని ఆటోడ్రైవర్లు వాపోతున్నారు. ప్రభుత్వం తమ గురించి ఆలోచించాలని విన్నవిస్తున్నారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

రూ.200కూడా వస్తలేవు



నిర్మల్: కాంగ్రెస్ సర్కార్ రావడంతో బాగానే ఉన్నాం. కానీ.. గత ప్రభుత్వాల హయాంలో ఆర్టీసీ నడుస్తుండే, ఆటోలూ నడుస్తుండే.. ఇప్పుడు మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో మాకు రోజుకు రూ.200 కూడా రావడం లేదు.

– షేక్‌హైమద్, ఆటోడ్రైవర్, లక్ష్మణచాంద

గిట్లయితే.. ఎట్ల బతుకుడు



నిర్మల్: పదేళ్ల నుంచి ఆటో నడుపుతున్నాం. ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి రాలేదు. రోజుకు కనీసం రెండుమూడు వందలు కూడా రావడం లేదు. ఈ పైసలతోని ఫైనాన్స్ కిస్తీలు ఎట్లా కట్టాలి. పిల్లలను ఎట్లా చదివించుకోవాలి. కుటుంబాన్ని ఎట్లా పోషించుకోవాలో అర్థమైతలేదు.

– ఖాదర్, ఆటోడ్రైవర్, నిర్మల్

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి



దస్తురాబాద్: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మహాలక్ష్మి పథకంతో ఆటో కార్మికులమంతా జీవనోపాధి కోల్పోతున్నాం. మహిళలంతా ఆర్టీసీ బస్సుల్లో చార్జీలు లేకుండా ప్రయత్నిస్తుండగా మాకు ఉపాధి కరువైంది. ఆటో కార్మికులను ఆదుకోవాలి.

– నేతి శేఖర్, దస్తురాబాద్

న్యాయం చేయాలి



దస్తురాబాద్: ప్రతిరోజూ ఆటో నడిపి కుటుంబాన్ని పోషించుకుంటున్న. మహిళలంతా ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తుండగా మా ఆటోలకు గిరాకీ లేదు. దీంతో మా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ప్రభుత్వం పునరాలోచించి తగిన న్యాయం చేయాలి. – కే శ్రీనివాస్, దస్తురాబాద్

పథకాన్ని రద్దు చేయాలి



కడెం: మహాలక్ష్మి పథకం కారణంగా ఆటో, టాటాఏస్ డ్రైవర్లమంతా రోడ్డున పడ్డాం. కిరాయిలు లేక ఖాళీగా ఉంటున్నాం. ప్రైవేట్ వాహనదారుల పొట్టకొడుతున్న మహాలక్ష్మి పథకాన్ని ప్రభుత్వం రద్దు చేయాలి. ఆటో, టాటాఏస్ డ్రైవర్లకు న్యాయం చేయాలి.

– సాకు లచ్చన్న, చిన్నబెల్లాల్, కడెం

కుటుంబ పోషణ భారమైంది



కడెం: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం స్టార్ట్ అయినప్పటి నుంచి మా ఆటోలకు ఒక్క ట్రిప్పు గిరాకీ రావడం లేదు. గతంలో రోజుకు రూ.500 వరకు వచ్చేవి. ఇప్పుడు రూ.100 కూడా రావడం లేదు. దీంతో కుటుంబ పోషణ భారంగామారింది.

– కాశిపాక నాగేశ్, కడెం

'ఆరుగ్యారంటీల అమలు తప్పనిసరి'



కడెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

కడెం: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలను తప్పనిసరిగా అమలు చేస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పేర్కొన్నారు. తనను గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని తెలిపారు. ఏ సమస్య ఉన్నా డైరెక్ట్‌గా తనను కలవవచ్చని పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పాండ్వపూర్, కొండుకూర్, కడెం తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మండల కేంద్రానికి వచ్చిన బొజ్జుకు కాంగ్రెస్ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. మండల కేంద్రంలోని ఇందిరాగాంధీ, అంబేడ్కర్, కుమురంభీం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ వసతి కల్పించామని, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచామన్నారు. కడెం ప్రాజెక్ట్ ఆధునీకరణ, సదర్‌మాట్ విషయం సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడానని తెలిపారు. టాటా ఏస్, ఆటో డ్రైవర్ల సమస్యను అసెంబ్లీలో ప్రస్తావిస్తానన్నారు. కాంగ్రెస్ గెలుపునకు కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే బొజ్జును కడెం ప్రెస్‌క్లబ్‌లో జర్నలిస్టులు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ అలెగ్జాండర్, కన్నాపూర్ సర్పంచ్ నరేందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు శంకర్, మాజీ వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, నాయకులు వాజీద్‌ఖాన్, సత్తెన్న, ఇందూర్‌నేత, సత్యం, గంగరాజం, కమలాకర్, రాజు, కృష్ణ, ఆనంద్‌రావు, మధు, రాజన్న, వెంకటేశ్ తదితరులున్నారు.

ప్రిన్సిపాల్ సస్పెన్షన్

ముధోల్: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాల ప్రిన్సిపాల్ ఎండీ రఫియొద్దీన్‌పై మంగళవారం తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకులాల సెక్రటరీ సస్పెన్షన్ వేటు వేశారు. తమను ప్రిన్సిపాల్ అసభ్య పదజాలంతో దూషించడమే గాకుండా, మద్యం తాగి వస్తున్నారని ఇటీవల పాఠశాల ఎదుట ఉపాధ్యాయులు ధర్నాకు దిగిన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన అధికార యంత్రాంగం అతడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా అమృతకు బాధ్యతలు అప్పగించారు.

పరిసరాల శుభ్రత పాటించాలి



కడ్తాల్‌లో నర్సరీని పరిశీలిస్తున్న శంకర్

సోన్: పరిసరాల పరిశుభ్రత పాటించాలని జెడ్పీ డిప్యూటీ సీఈవో శంకర్ సూచించారు. మండలంలోని కడ్తాల్, గంజాల్ గ్రామాల్లోని నర్సరీలు, అంగన్‌వాడీ కేంద్రాలు, యునానీ వైద్యశాల, పల్లె ప్రకృతి వనాలు, మురుగుకాల్వలను మంగళవారం ఎంపీడీవో మోహన్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మొక్కలు ఎండిపోకుండా పంచాయతీ సిబ్బంది నిత్యం నీటిని అందించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే తల్లులు, చిన్నారులకు నిత్యం గుడ్లు, పోషకాహారం అందించాలని సూచించారు. ఎంపీవో కలీల్ హైమద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, కార్యదర్శులు సుమయ్యద్ తస్కీన్, సుర్జీత్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పక్కాగా 'పల్లె' పద్దు!

- ఈ–గ్రామ్ స్వరాజ్ యాప్‌లో వివరాలు
- నిధులు ఆదాయ, వ్యయాలు నమోదు
- పారదర్శకతకు కేంద్రం పెద్దపీట



నిర్మల్ ఖిల్లా: పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం నెలరోజుల్లో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఆయా పంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, ఆదాయవ్యయాలు, నిధుల వివరాలు ఎవరైనా తెలుసుకునే వీలుంది. గ్రామపంచాయతీ పరిధిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వచ్చిన నిధులు.. వ్యయం.. మిగులు తదితర వివరాలు తెలుసుకునేందుకు కేంద్రం ఈ–గ్రామ్ స్వరాజ్ యాప్‌ను మూడేళ్ల క్రితమే అందుబాటులోకి తెచ్చింది. అనుమతులు, నిబంధనలకు విరుద్ధంగా కొనసాగే పనులను నిలిపివేసేందుకు పారదర్శకత కోసం చొరవ చూపింది. ఈ యాప్ ద్వారా గ్రామపంచాయతీ సమగ్ర సమాచారం తెలుసుకునే మార్గాన్ని సులభతరం చేసింది. యాప్‌లో ప్రతీ లెక్క పక్కాగా పొందుపరచి ఉంటుంది. దీని గురించి చాలామందికి అవగాహన లేకపోవడంతో పంచాయతీ ఆదాయ, వ్యయ వివరాలు తెలుసుకోలేకపోతున్నారు.

తప్పుడు లెక్కలకు తావు లేకుండా..

గ్రామపంచాయతీ నిధులు.. చేపట్టిన పనుల వివరాలు వార్డుల వారీగా ఎప్పటికప్పుడు యాప్‌లో అప్లోడ్ చేస్తారు. కేంద్ర ప్రభుత్వం, ఆర్థిక సంఘం నుంచి విడుదలైన నిధుల వివరాలు.. విడుదల కావాల్సిన నిధుల వివరాలు యాప్ ద్వారా ఇట్టే తెలిసిపోతుంది. గ్రామపంచాయతీ పాలకవర్గాలు కూడా పొరపాట్లకు తావివ్వకుండా ప్రతీపైసాను లెక్క ప్రకారం ఖర్చు చేసేందుకు అవకాశం ఉంటుంది. గ్రామపంచాయతీ కార్యదర్శి నుంచి సర్పంచ్, వార్డు సభ్యుల వరకు ఎవరు ఏ తప్పుడు నివేదికలు చూపినా ఈ–గ్రామ్ స్వరాజ్ యాప్ ద్వారా పౌరులు ప్రశ్నించి సమాచారాన్ని రాబట్టవచ్చు.

సమాచారం అతి సులభం..

మొబైల్ ఫోన్లలో ప్లే స్టోర్‌లో ఈ–గ్రామ్ స్వరాజ్ అనే యాప్ మొదట డౌన్లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. డౌన్లోడ్ అయిన తర్వాత ఓపెన్ చేస్తే మొదటి పేజీలో రాష్ట్రం, జిల్లా, మండలం, గ్రామం.. తదితర వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. వాటిని ఎంపిక చేసుకున్న అనంతరం క్లిక్ చేస్తే ఆ గ్రామానికి సంబంధించిన ఆదాయవ్యయాలు, నిధుల పూర్తి సమాచారం వార్డుల వారీగా నమోదై ఉంటుంది.

సమాచారం ఇలా పొందొచ్చు..

జిల్లాలో 19 మండలాలుండగా 396 గ్రామపంచాయతీలున్నాయి. ప్రతీ గ్రామపంచాయతీకి సంబంధించిన అభివృద్ధి పనులు, ఆర్థిక పురోగతి, ఆస్తులు.. జియో ట్యాగింగ్ ద్వారా ఈ యాప్‌లో నిక్షిప్తమై ఉంటాయి. వీటిని పొందుపరచాల్సిన బాధ్యత పంచాయతీరాజ్‌శాఖది. పంచాయతీ పాలక వర్గాల పేర్లు.. పంచాయతీ కార్యదర్శి వివరాలు.. మంజూరైన నిధులు.. ఏయే పనులకు ఎంత వ్యయం చేశారు.. ఆ పనుల ప్రస్తుత పురోగతి తదితర అంశాలు కూడా అందుబాటులో ఉంటాయి. అంచనా వ్యయాలు అభివృద్ధి పనుల నివేదికలు ఇందులో క్లుప్తంగా పొందుపరచబడి ఉంటాయి. జీపీఆర్‌ఎస్ ద్వారా గుర్తించడంతో ఒకసారి చేసిన పనులకు మరోసారి బడ్జెట్ కేటాయించడానికి అవకాశం ఉండదు. తద్వారా నిధులపై పారదర్శకత ఎక్కువగా ఉంటుంది. ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా పకడ్బందీగా ఈ–గ్రామ్‌స్వరాజ్ యాప్ అమలు జరుగుతుంది.

సమగ్ర సమాచారం అందుబాటులో..



కేంద్ర ప్రభుత్వం మూడేళ్ల కిందట ప్రవేశ పెట్టిన ఈ–గ్రామ్‌స్వరాజ్ యాప్ ద్వారా గ్రామపంచాయతీల నిధుల వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. అత్యంత పారదర్శకంగా ఉండేందుకు ఈ యాప్ పౌరులకు ప్రయోజనకరంగా ఉంటుంది. గ్రామ ప్రజలు తమ మొబైల్ ఫోన్‌లోనే గ్రామాభివృద్ధి పనుల కోసం చేపట్టిన వ్యయం వివరాలు, పొందిన నిధుల వివరాలను కూడా తెలుసుకోవచ్చు. అధికారులు జవాబుదారీతనంగా ఉండేందుకు ఈ యాప్ తోడ్పడుతుంది. వివరాలన్నీ ఇందులో సమగ్రంగా పొందుపరచబడి ఉంటాయి.

– కుమ్మరి వెంకటేశ్, చించోలి (బీ)

ముగిసిన దుకాణాల వేలం



దరఖాస్తులు పరిశీలిస్తున్న ఈవో విజయరామారావు

భైంసా: బాసర సరస్వతీ ఆలయ ఆవరణలో దుకాణాల నిర్వహణకు ఈవో కార్యాలయం ఎదుట మంగళవారం వేలం నిర్వహించారు. ఆలయంలో దుకాణాల సముదాయం, చీరెల కౌంటర్, గోదావరి వద్ద విడిపూలు, దొప్పలు, పండ్ల విక్రయం, ఫొటోలు తీయడం లాంటి పనులకు వేలం చేపట్టారు. ఏడాది కాలపరిమితితో దుకాణాలు నిర్వహించుకునేందుకు దేవాదాయ కమిషనర్ ఉత్తర్వులకు అనుగుణంగా బహిరంగవేలం నిర్వహించారు. వ్యాస గుహవద్ద పూజసామగ్రి దుకాణం, కూల్ డ్రింక్స్ దుకాణం, ఆలయ ప్రాంగణంలో భక్తుల సామగ్రి భద్రపరుచుకునే హక్కు, గోదావరి నది వద్ద విడిపూలు, దొప్పలు అమ్ముకునేందుకు, లక్ష్మీసదనం వెనుక షాప్–4, దేవస్థానం వద్ద పాదరక్షలు భద్రపరుచుకునే హక్కుల కోసం పలు టెండర్లు వచ్చాయి. టెండర్ ప్రక్రియ ద్వారా ఆలయానికి రూ.31,06,299 ఆదాయం సమకూరినట్లు ఈవో విజయరామారావు వెల్లడించారు.

'మహిళా ప్రయాణికులకు ఇబ్బందులు రానివ్వొద్దు'



డీఎంతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిర్మల్‌చైన్‌గేట్: మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మహిళా ప్రయాణికులు ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రయాణం కొనసాగించేందుకు సహకరించాలని సూచించారు. అనంతరం మున్సిపల్ పరిధిలోని ధర్మసాగర్, వైకుంఠధామం, సిర్గాపూర్‌లోని నర్సరీ, ఫిల్టర్ బెడ్, బంగల్‌పేట్‌లో పారిశుధ్య వనరుల ఉద్యానవనాన్ని పరిశీలించారు. ధర్మసాగర్ చెరువు దగ్గర నిర్మించనున్న సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ స్థలం, బైల్ బజార్ దగ్గర నిర్మిస్తున్న శ్మశాన వాటిక పనులు పరిశీలించి త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సిద్దాపూర్‌లో నిర్వహిస్తున్న నర్సరీ, వాటర్‌షెడ్ పనులు పరిశీలించారు. ఆయన వెంట ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి, మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, డీఈ సంతోష్, ఏఈలు వినయ్, హరిభువన్, టీపీవో సుమలత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవిదాస్ పాల్గొన్నారు.

సమీక్షా సమావేశం

కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జిల్లా పంచాయతీరాజ్‌శాఖ అధికారులతో గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, పరిశుభ్రత, తాగునీటిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అన్ని గ్రామపంచాయతీల్లో కొనసాగుతున్న పచ్చదనం, పరిశుభ్రత, తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి సేకరణ, విద్యుత్, తాగునీటి సరఫరా తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. లేబర్ మొబలైజేషన్ తప్పనిసరిగా చేయాలని, పంచాయతీ సెక్రటరీ, ఎంపీవోలు ఉదయమే ఫీల్డ్‌కు వెళ్లాలని ఆదేశించారు. శానిటేషన్, అవెన్యూ ప్లాంటేషన్‌పై స్పెషల్ ఫోకస్ పెట్టాలని, డోర్ టు డోర్ చెత్త సేకరించాలని ఆదేశించారు. పల్లెప్రకతివనాల మెయింటెనెన్స్ గ్రామపంచాయతీ అధికారులే చూడాలన్నారు. మొక్కలు వాడకుండా ప్రతీరోజు నీటిని అందించాలని సూచించారు. రోడ్ల మీద చెత్తాచెదారం లేకుండా శుభ్రంగా ఉండాలని, పెండింగ్‌లో ఉన్న పంచాయతీ భవనాలకు అనుమతి త్వరగా తీసుకుని నిర్మాణ పనులు ప్రారంభించాలన్నారు. పెంబి, ఖానాపూర్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. డీఎఫ్‌వో రాంకిషన్, డీఆర్డీవో విజయలక్ష్మి, ఈఈ పీఆర్ శంకరయ్య, ఎల్డీఎం చంద్రశేఖర్, ఎంపీడీవో, ఎంపీవోలు, ఏపీవోలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఆటలపోటీలు

నిర్మల్‌చైన్‌గేట్: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 15న ఎన్టీఆర్ మినీస్టేడియంలో జిల్లాస్థాయి ఆటలపోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా స్త్రీ, శిశు, దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి రమేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల దివ్యాంగులు ఉదయం 9గంటలకు హాజరు కావాలని పేర్కొన్నారు. జూనియర్స్ (10–16 ఏళ్లు), సీనియర్స్ (17–35) విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పాల్గొనేవారు సదరం, ఆధార్‌కార్డులు వెంటతీసుకురావాలని సూచించారు. అంధులకు రన్నింగ్, షాట్‌పుట్, చెస్, బధిరులకు రన్నింగ్, షాట్‌పుట్, క్యారమ్స్, చెస్, శారీరక వైకల్యంగల వారికి రన్నింగ్, చెస్, షాట్‌పుట్, జావెలిన్ త్రో, వీల్‌చైర్/ట్రై సైకిల్ రేస్, క్యారమ్స్ బుద్ధి మాంద్యం గల వారికి రన్నింగ్, చెస్, షాట్‌పుట్, క్యారమ్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు జిల్లా కేంద్రంలోని జిల్లా సంక్షేమాధికారి, మహిళా శిశు దివ్యాంగులు, వయోవృద్ధులశాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

చెక్‌బౌన్స్ కేసులో ఒకరికి జైలు

బోథ్: చెక్‌బౌన్స్ కేసులో బోథ్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి హుస్సేన్ ఒకరికి సంవత్సరం జైలు శిక్ష విధించారు. వివరాల్లోకి వెళితే... 2018వ సంవత్సరంలో సూర్యవంశీ శ్రీనివాస్ దగ్గర ఖాజాపాషా అనే వ్యక్తి రూ. 1,60,000లను తీసుకున్నాడు. డబ్బులు అడిగితే ఖాజాపాషా చెక్కును ఇచ్చాడు. బ్యాంకులో చెక్ బౌన్స్ కావడంతో సూర్యవంశీ శ్రీనివాస్ బోథ్ జూనియర్ సివిల్ కోర్టులో కేసు వేశాడు. పూర్తి కేసు విచారణ అనంతరం జడ్జి పైవిధంగా తీర్పునిచ్చారు.

సెల్‌ఫోన్ దొంగకు జైలు

నిర్మల్‌టౌన్: సెల్‌ఫోన్ దొంగకు నిర్మల్ కోర్ట్ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. కోర్టు సమన్వయల అధికారి సక్రియ నాయక్ వివరాల ప్రకారం... జిల్లా కేంద్రంలోని గాజుల్‌పేట్‌కు చెందిన మోతే రాజేందర్ జల్సాలకు అలవా టుపడి 28 ఏప్రిల్ 2015వ తేదీన నిర్మల్ బ స్టాండ్‌లో బస్సు కోసం చూస్తున్న జాక్కర్ బా లాజి, భాగవ్వ దగ్గర నుంచి రూ.3వేల విలు వ గల రెండు సెల్‌ఫోన్లు దొంగలించుకుని పా రిపోయాడు. ఈ విషయంపై నిర్మల్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బాలాజి ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్సై సునీల్‌కుమార్ కేసు నమోదు చేశాడు. విచారణ నిమిత్తం చార్జిషీట్ దాఖలు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచాడు. ఏపీపీవో రామకృష్ణ ఐదుగురు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నేరం రుజువు చేశాడు. దీంతో రాజేందర్‌కు మూడు నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ.. నిర్మల్ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి మంగళవారం తీర్పునిచ్చారు.

గంజాయి విక్రేతల అరెస్టు

భైంసాటౌన్: పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు భైంసా ఎక్సైజ్ సీఐ నజీర్‌హుస్సేన్ తెలిపారు. ఓవైసీనగర్‌లో గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు సోమవారం రాత్రి దాడి చేయగా మహ్మద్ బారి అనే వ్యక్తి వద్ద నుంచి 350గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గతంలో గంజాయి విక్రయించిన కేసులో పరారీలోని మరో నిందితుడు ముజాహిద్‌ను సైతం అదుపులోకి తీసుకున్నారు. వీరు పట్టణంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల యువకులను లక్ష్యంగా చేసుకుని గంజాయి అమ్మకాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. నిషిద్ధ మత్తు పదార్థాలను విక్రయించినా, తరలించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో చురుగ్గా వ్యవహరించిన ఎస్సైలు రమేశ్ కుమార్, ప్రణీత్‌గౌడ్, సిబ్బంది అశోక్, కృష్ణమూర్తి, నిజాం, రవి, శైలేష్, సంతోష్, సుజాత, లక్ష్మి, గంగాసింగ్, అశోక్, ప్రశాంత్‌లను సీఐ అభినందించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

భైంసారూరల్: మండలంలోని మాటేగాం గ్రామ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మంగళవారం మాటేగాం గ్రామ సమీపంలో పోలీసుల వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. భైంసా పట్టణం నుంచి బులెరో వాహనంలో 25క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనపరుచుకున్నట్లు వెల్ల డించారు. ఈ విషయాన్ని సంబంధిత రెవెన్యూ శాఖ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

సర్కారు బడుల్లో సాధికారత క్లబ్‌లు

- జిల్లాలోని వంద పాఠశాలల్లో..
- బాలికలపై వేధింపులకు చెక్
- ఈనెల 14న క్లబ్‌ల ఏర్పాటు



కేజీబీవీ విద్యార్థినులు (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: సర్కారు బడుల్లో సాధికారత క్లబ్‌లు ఏర్పాటు చేసేందుకు పాఠశాల విద్య శాఖ చర్యలు చేపట్టింది. రాష్ట్రంలోని ప్రతీ జిల్లాలో వంద పాఠశాలను ఎంపిక చేసి ఈ క్లబ్‌ను ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలోని పాఠశాలల్లోని బాలికలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈ క్లబ్‌లు దోహద పడనున్నాయి. పాఠశాల విద్యాశాఖ నుంచి వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు ఇటీవల ఉత్తర్వులు జారీ అయ్యాయి. కౌమర బాలికలకు సమాజంలోని పరిస్థితులు, బాలికలు శారీరక వేధింపులకు గురికాకుండా చూడటం, లైంగిక దాడులు, బాల్య వివాహాలు, బాలికలు ఎదుర్కొనే తదితర సమస్యలపై అవగాహన కల్పించనున్నారు.

బడిలోనే సమస్యల పరిష్కారం కోసం..

కౌమర దశలోని బాలికలు ఏవైన ఇబ్బందులకు గురైతే పాఠశాలలోనే వాటిని పరిష్కరించే విధంగా విద్య శాఖ చర్యలు చేపట్టింది. ఈనెల 14న ఈ క్లబ్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఈ క్లబ్‌లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చైర్మన్‌గా, మహిళ ఉపాధ్యాయురాలు కన్వీనర్‌గా, మహిళ కానిస్టేబుల్, షీటీమ్ ఇన్‌చార్జితో పాటు ప్రతి తరగతికి ఇద్దరు చొప్పున విద్యార్థినిలు సభ్యులుగా ఉంటారు. ఈ క్లబ్‌ల ద్వారా బాలికల ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, జీవన నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, లింగ సమానత్వం, బాలికలపై హింసను అరికట్టేవిధంగా చర్యలు చేపడతారు. ప్రతీనెల సమావేశాన్ని నిర్వహిస్తారు. విద్యార్థినిలకు ఏవైన ఇబ్బందులు ఉన్నాయా అనే విషయాలను తెలుసుకుంటారు.

విద్యార్థినుల్లో ధైర్యం నింపేందుకు..



విద్యార్థినిల్లో ధైర్యం నింపేందుకు బాలికల సాధికారత క్లబ్‌లు ఎంతగానో దోహదపడతాయి. జిల్లాలో వంద పాఠశాలలను ఎంపిక చేశాం. కౌమర దశలో వచ్చే మార్పులు, బాల్య వివాహాలు, బాలికల ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించడం జరుగుతుంది. ఈనెల 14న కమిటీలను ఎన్నుకుంటాం. తరగతి నుంచి ఇద్దరు విద్యార్థులతో పాటు హెచ్‌ఎం, ఫ్రెండ్లీ లేడీ టీచర్ సభ్యులుగా ఉంటారు. కోఎడ్యూకేషన్ ఉన్నచోట బాలురు ఏవిధంగా వ్యవహరించాలి, తదితర విషయాల గురించి అవగాహన కల్పించడం జరుగుతుంది.

– ఉదయశ్రీ, విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి

జాతీయ స్థాయి క్యాంప్‌నకు జిల్లా విద్యార్థి



అభినందిస్తున్న ప్రిన్సిపల్ శ్రీనివాస్, లెక్చరర్లు

ఆదిలాబాద్‌టౌన్: జాతీయ స్థాయి ఎన్‌ఎస్‌ఎస్ అడ్వెంచర్ క్యాంప్‌నకు జిల్లా విద్యార్థి ఎంపికయ్యాడు. ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఎంపీసీ తృతీయ సంవత్సరం చదువుతున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ సూర్యకాంత్ ఇటీవల కేయూ విశ్వ విద్యాలయంలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబర్చాడు. హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రం ధర్మశాలలోని అటల్‌బిహారి వాజ్‌పేయ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మౌంటనీరింగ్ అండ్ అలైడ్ స్పోర్ట్స్ క్యాంప్‌నకు ఎంపికయ్యాడు. ఈ పోటీలు ఈనెల 23 నుంచి జనవరి 1 వరకు జరగనున్నాయి. ఈ క్యాంప్‌నకు విద్యార్థి ఎంపిక కావడంపై కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, లెక్చరర్లు దయాకర్, అష్రఫ్ అలీ, సంతోష్, రఘునాథ్, రమేష్ అభినందించారు.

పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

- క్వింటాల్‌కు రూ.1000 బోనస్ ప్రకటించాలి
- తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బండి దత్తాత్రి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు బండి దత్తాత్రి

ఎదులాపురం: అధిక వర్షాలతో జిల్లాలో పత్తి, కంది పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, పత్తికి మైచర్ 20శాతం మినహాయింపు ఇస్తూ రూ.1000 బోనస్ అందించి కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బండి దత్తాత్రి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్క్‌ఫెడ్ ద్వారా పత్తిని కొనుగోలు చేయాలని, ఇప్పటి వరకు కొనుగోలు చేసిన వాటికి కూడా రూ.1000 బోనస్ ఇచ్చే విధంగా కృషి చేయాలని డిమాండ్ చేశారు. సీసీఐ ద్వారా కొనుగోలు చేయకపోవడంతో రైతులు ప్రైవేటు వ్యాపారులపై ఆదారపడే పరిస్థితి ఉందన్నారు. ప్రతి రైతు క్వింటాల్‌కు రూ.600 నష్టపోతున్నారని, ప్రభుత్వ రంగ సంస్థలైన సీసీఐ, మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసి రైతులకు న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకొని రైతులను ఆదుకోవాలన్నారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి స్వామి, నాయకులు శంకర్, సంతోష్, ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల దుస్థితి మారలేదు

- రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్

ఎదులాపురం: 77ఏళ్ల స్వాతంత్ర్య భారతదేశంలోనూ కార్మికుల దుస్థితి మారలేదని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని భుక్తాపూర్‌లోని యూనియన్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఏఐటీయూసీలో చేరికల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. యూనియన్‌లో చేరిన 52 మంది సెంట్రల్ వేర్ హౌజ్ కార్పొరేషన్ కార్మికులకు యూనియన్ కండువాలు కప్పి ఏఐటీయూసీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ సీడబ్ల్యూసీలో కార్మికులు దాదాపుగా 25ఏళ్లుగా పనిచేస్తున్నా నేటికీ వారికి గుర్తింపు కార్డులు, ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ అందించడం లేదన్నారు. నేరుగా కార్మికుల అకౌంట్‌లో చేసిన కష్టం డబ్బులు వేయకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా కార్మికుల పట్ల చొరవ తీసుకుని కేంద్ర ప్రభుత్వం సెంట్రల్ పరిధిలో పనిచేస్తున్న సీడబ్ల్యూసీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందులో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుంటాల రాములు, ఏఐకేఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి చిల్క దేవిదాస్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మేస్రం భాస్కర్, రామడుగు జాషువా, ఏఐఎస్ఎఫ్ జిల్లా, అధ్యక్ష కార్యదర్శులు గేడం కేశవ్, మడావి గణేశ్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల ఆకాంక్షలు నెరవేర్చాలి

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేశ్



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేశ్

ఎదులాపురం: రాష్ట్ర ప్రభుత్వం వర్కర్స్ మేనిఫెస్టో అమలు చేసి కార్మికులు, ఉద్యోగుల ఆకాంక్షలను నెరవేర్చాలని సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని కార్మిక వర్గం, ఉద్యోగులు అనేక ఆకాంక్షలతో, ఆశలతో రాష్ట్ర సాధన కోసం పోరాటం చేశారన్నారు. కనీస వేతనాలు అమలవుతాయని, సర్వహక్కులు అందుతాయని ఆశించారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర కార్మిక వర్గం, ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారాన్ని అప్పజెప్పారన్నారు. ఎన్నికల కంటే ముందుగానే తెలంగాణ రాష్ట్ర కార్మిక వర్గం ఆశలను ఆకాంక్షలను ప్రతిబింబించే విధంగా వారి డిమాండ్లను వర్కర్స్ మేనిఫెస్టో రూపంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ అన్ని రాజకీయ పార్టీల నాయకత్వాలను కలిసి వర్కర్స్ మేనిఫెస్టో ప్రతులను అందించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని సద్వినియోగం చేసుకుంటూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కార్మికుల సమస్యలను పరిష్కరించే విధంగా సీఐటీయూ వర్కర్స్ మేనిఫెస్టోను అమలు చేయాలని కోరారు. అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన పథకం, ఐకేపీ స్కీమ్ వర్కర్స్ అందరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ అన్ని హక్కులు కల్పించాలని, 73 షెడ్యూల్డ్ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులందరికీ నూతన కనీస వేతన సవరణ జీవోలను విడుదల చేయాలన్నారు. హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని, ఏపీ ట్రాన్స్‌ఫోర్ట్ కార్మికులను ఆదుకునేందుకు ప్రణాళిక రూపొందించాలని, ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ సభ్యులు సోమన్న, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆశన్న, కిరణ్, కోశాధికారి సునీత, ఉపాధ్యక్షులు లింగాల చిన్నన్న, వెంకటమ్మ, గంగన్న, సహాయ కార్యదర్శి జితేందర్, శోభ, సుజాత ఉన్నారు.

‘దళిత దెబ్బ’కు అనుమతి ఇవ్వొద్దు



ఫిర్యాదు కాపీతో ఆదివాసీ నాయకులు

ఆసిఫాబాద్: నార్నూర్ మండల కేంద్రంలో దళిత జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం తలపెట్టిన దళిత దెబ్బ కార్యక్రమానికి అనుమతి ఇవ్వవద్దని ఆదివాసీ సంఘాల నాయకులు మంగళవారం ఎస్పీకి ఫిర్యాదు చేశారు. 5వ షెడ్యూల్ ఏజెన్సీ ప్రాంతమైన నార్నూర్‌లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా చేపడుతున్న నిరసన కార్యక్రమాన్ని తక్షణమే నిలుపుదల చేయాలన్నారు. కార్యక్రమం ఆదివాసీల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉందని, దీనివల్ల ఏజెన్సీలో గిరిజనులు, గిరిజనేతరుల మధ్య తీవ్ర ఘర్షణలు చోటు చేసుకునే అవకాశం ఉందన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు గేడం కైలాస్, నైతం అరవింద్, శివశంకర్, బండి రామన్న ఉన్నారు.

పాముకాటుతో రైతు మృతి



శంకర్ (ఫైల్)

తలమడుగు: పాము కాటుతో రైతు మృతి చెందిన సంఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని బరంపూర్ గ్రామానికి చెందిన సంపతి శంకర్ యాదవ్(39) మంగళవారం ఉదయం తన పంట పొలంలో పత్తి తీయడానికి భార్య విజయలక్ష్మితో కలిసి వెళ్లాడు. మధ్యాహ్న సమయంలో ఎద్దులకు పశుగ్రాసం వేయడానికి వెళ్లగా అక్కడ ఎడమ కాలుకు పాముకాటు వేయడంతో కిందపడిపోయాడు. ఇంక రాకపోవడంతో భార్య విజయలక్ష్మి వెంటనే వెళ్లి చూడగా స్పృహ తప్పి పడిపోయి కనిపించాడు. వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ధనశ్రీ తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

భైంసా: బాసర గోదావరి నదిలో మంగళవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు వెళ్లి పరిశీలించగా మృతదేహం పూర్తిగా కుళ్లిన స్థితిలో ఉండడంతో గుర్తు పట్టలేని విధంగా ఉందని ఎస్సై తెలిపారు. మృతురాలి వయసు దాదాపు 55–60 ఏళ్లు ఉంటాయని, సంబంధీకులు ఎవరైనా ఉంటే పోలీసులను సంప్రదించాలని పేర్కొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ క్రీడ పాఠశాలకు చెందిన విద్యార్థులు హన్మకొండ జిల్లా కేంద్రంలో జరిగిన 67వ ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటారు. అండర్ 17 విభాగంలో క్రాస్ కంట్రీ 6కిలోమీటర్ల ఈవెంట్‌లో మనీషా బంగారు పతకాన్ని సాధించి, లక్నోలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించనుంది. అండర్‌- 14 విభాగంలో 600 మీటర్ల పరుగు పందెంలో ఆనంది రజత పతకం సాధించి, ముంబైలో జరగనున్న జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు అర్హత సాధించింది. అండర్‌- 17 విభాగంలో హై జంప్‌లో అయేషా సిద్ధికి, అండర్ 14 విభాగంలో 100 మీటర్ల రిలే ఈవెంట్లో నందిని రజత పతకాలను సాధించారని ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు తెలిపారు. విజేతలుగా నిలవడంపై పలువురు అభినందనలు తెలిపారు.

హైందవ సంస్కృతి పరిరక్షణకు పాటుపడాలి

- కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి



అక్షింతల కలశంతో ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: హైందవ సంస్కృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి అన్నారు. జిల్లా కేంద్రంలోని తిరుపెల్లి కాలనీలోని శ్రీరామాలయంలో అయోధ్య రామ మందిరం అక్షింతల స్వాగత శోభాయాత్ర కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సనాతన సంస్కృతి సంప్రదాయాలను మరవకూడదన్నారు. భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రస్తుత తరానిపై ఉందన్నారు. అయోధ్యలో నిర్మితమైన భవ్యమైన రామ మందిర ప్రారంభోత్సవానికి ఆదిలాబాద్ ప్రజలకు ఆహ్వానం అందిందన్నారు. ఈ నేపథ్యంలోనే అక్షింతల స్వాగత శోభాయాత్ర కార్యక్రమం నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం రామాయణ వైశిష్ట్యాన్ని భక్తులకు వివరించారు. ఎమ్మెల్యే పాయల శంకర్ అక్షింతల కలశాన్ని తలపై పెట్టుకుని శోభాయాత్రలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సనాతన హిందూ ధర్మం ఎంతో గొప్పదని, యువత హిందూ ధర్మాన్ని పరిరక్షిస్తూ దేశం కోసం కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. లో డీఎస్పీ ఉమేందర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసిని రెడ్డి, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బోండ్ల నారాయణ, టౌన్ ప్రెసిడెంట్ ప్రశాంత్, సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, మాధవ్ ఉన్నారు.

క్రీడల్లో రాణించడం అభినందనీయం



విద్యార్థులను అభినందిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత

- జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత

ఆదిలాబాద్: రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ పోటీల్లో జిల్లా క్రికెట్ జట్టు మూడవ స్థానంలో నిలవడం అభినందనీయమని జిల్లా విద్యాశాఖ అధికారిని ప్రణీత అన్నారు. ఇటీవల రాష్ట్రస్థాయి పోటీల్లో 17 సంవత్సరాల విభాగంలో మూడవ స్థానంలో నిలిచిన క్రికెటర్లు మంగళవారం డీఈఓను కలవగా ఆమె వారిని అభినందించారు. కప్పును విద్యార్థులకు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రికెట్ ఆటకు ప్రస్తుతం ఎంతో ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. క్రికెట్లో మరిన్ని మెలకువలను అభ్యసించి గొప్ప క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, పెటా సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్ స్వామి, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు దయానంద్ రెడ్డి, గజేంద్ర పటాస్కర్, ప్రిన్సిపల్ కమలాకర్ రెడ్డి తదితరులున్నారు.

కృత్యాధారాలతో బోధించాలి

నిర్మల్ రూరల్: విద్యార్థులకు కృత్యాధార పద్ధతిలో బోధించాలని డీఈవో రవీందర్‌రెడ్డి సూచించారు. మండలంలోని వెంగవాపేట్ ఉన్నత పాఠశాలలో మంగళవారం గణిత ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా రవీందర్ రెడ్డి హాజరై మాట్లాడారు. ఉన్నతి, లక్ష్య, కార్యక్రమాల అమలు ఉపాధ్యాయులకు వివరించారు. పాఠ్య పథకాల రూపకల్పన, బోధనోపకరణాల వినియోగం, విద్యార్థుల ప్రగతి వివరాలపై కూలంకషంగా చర్చించారు. అభ్యాస దీపికలను ఎప్పటికప్పుడు వినియోగిస్తూ బోధించాలని తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు సిలబస్‌ను క్రమ పద్ధతిలో పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ పద్మ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు గజ్జరాం, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, రిసోర్స్ పర్సన్స్ హరిప్రసాద్, నాగుల రవి, సీఆర్పీ నాగలక్ష్మి, గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోలుకుంటున్న నాగచైతన్య




ఆర్థికసాయం అందిస్తున్న ఎస్సై అశోక్

దస్తురాబాద్: మండల కేంద్రానికి చెందిన నాగచైతన్య అనే బాలుడు ఈ నెల 6న విద్యుత్ షాక్ గురై తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చేరాడు. వైద్యానికి డబ్బులు లేక నిరుపేద కుటుంబానికి చెందిన అతడి తల్లిదండ్రులు తల్లడిల్లిన వైనంపై ఈ నెల 7న ‘నా కొడుకుని కాపాడండి’ శీర్షికన సాక్షిలో ప్రచురించిన కథనానికి దాతలు స్పందిస్తున్నారు. నాగచైతన్య కుటుంబానికి ఆర్థికసాయం చేస్తున్నారు. మండలంలో పని చేసి బదిలీపై వెళ్లిన ఎస్సై గుమ్మల అశోక్ మంగళవారం ఆస్పత్రికి వచ్చి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ.32వేల ఆర్థిక సాయాన్ని అందించారు. అలాగే మండల కేంద్రానికి చెందిన చందా జీవన్ రూ.5వేల అందజేశారు.

నిర్మల్ బస్టాండ్‌లో షాపులు దగ్ధం



కాలిపోతున్న పండ్ల దుకాణం



కాలిపోతున్న దుకాణాలు

నిర్మల్‌టౌన్: నిర్మల్ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రమాదవశాత్తు షాపులు దగ్ధమైన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. నిర్మల్ ఆర్టీసీ బస్టాండ్‌కు సంబంధించి షాపుల పక్కన చలి మంటలు కాగుతుండగా ఆ మంటలు కాస్తా పక్కన ఉన్న బేకరిలోకి ఎగిసిపడ్డాయి. వెంటనే స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే ఆ షాప్‌తో పాటుగా పక్కన ఉన్న మూడు షాపులు పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ.3లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు ఫైర్ సిబ్బంది పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అధికారి

ఆదిలాబాద్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా హాకీ క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలని జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఎస్జీఎఫ్ జోనల్‌స్థాయి అండర్ 17 హాకీ ఎంపిక పోటీలను ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావుతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జోనల్ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. పోటీల కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, ఆర్గనైజర్ రవీందర్, సీనియర్ క్రీడాకారులు ఉన్నారు.